ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
మంగళవారం 15 జూలై 2025


సీఎం రేవంత్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ పాలనలో పేదలకు లబ్ధి

- టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్

ఆమనగల్లు, జూలై 14(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలోనే ప్రతీ పేద కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీత నర్సింహ్మా, వైస్‌చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లీ రాములు అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న నేపథ్యంలో ఆమనగల్లు పట్టణంలో సోమవారం కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, పార్టీ పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ చిత్రపటానికి వారు పాలాభిషేకం చేశారు. దావ దనుంజయ్య , కృష్ణనాయక్, రవీందర్ నాయక్, కర్నాటి కొండల్ రెడ్డి, ఖలీల్, కాలే మల్లయ్య, ఖాదర్, ఫరీద్, శ్రీధర్ రెడ్డి , కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, వస్పుల శ్రీకాంత్, పర్వతాలు, రాఘవేందర్, తాళ్ల రవీందర్, మైసయ్య, షాబొద్దీన్, మహేశ్, సురేశ్, శ్రీశైలం పాల్గొన్నారు.

ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి

చేవెళ్ల, షాద్‌నగర్‌లో చీటికి మాటికి మరమ్మతులు

రోజుకు 10 నుంచి 20 సార్లు సరఫరాలో అంతరాయం

విసుగిపోతున్న జనం..

వ్యాపారుల ఉపాధికి దెబ్బ

"అప్రకటిత విద్యుత్ కోతలతో జిల్లా వాసులు విసుగెత్తిపోతున్నారు. కరెంటు ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా కరెంట్ తీసేస్తున్నారు. దీనికితోడు చిన్న గాలి వీచినా.. వర్షం పడినా వెంటనే సరఫరా నిలిచిపోతుండటంతో ప్రజలు చీకట్లో మగ్గుతున్నారు. ఇక పల్లెల్లో అయితే కరెంట్ పోతే ఎప్పుడు వస్తుందో చెప్పలేం. అనధికార కోతలతో రైతులు, చిన్న తరహా పరిశ్రమల నిర్వాహకులు, చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తీవ్రంగా నష్టపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కరెంట్ కట్ కట!

అప్రకటిత కోతలతో వెతలు

విద్యుత్ సరఫరాలో నిత్యం అంతరాయం

విద్యుత్ కేంద్రాల వివరాలు

400 కేవీ ఉప కేంద్రాలు :	04
220/132 కేవీ ఉప కేంద్రాలు :	10
132/11కేవీ ఉపకేంద్రాలు :	22
33/11కేవీ ఉప కేంద్రాలు :	240
రోజు వారి సగటు విద్యుత్ వాడకం (మి.యూ) :	22.05
విద్యుత్ డిమాండ్ (మె.వా) :	819.63
వ్యవసాయ వినియోగదారులు : (5కేటగిరి) :	1,19,947
గృహ వినియోగదారులు (కేటగిరి-1):	16,56,990
వాణిజ్య వినియోగదారులు (కేటగిరి-2) :	2,50,275
పరిశ్రమలు (కేటగిరి-3+4+హెచ్‌టీ) :	16,058
వీధి దీపాలు (6-ఏ) :	12,262
ఇతర వినియోగదారులు :	10,059

రంగారెడ్డి అర్బన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : చేవెళ్ల మండలంలో రోజుకు 10-20 సార్లు కరెంట్ కట్టవుతుందని వినియోగదారులు చెబుతున్నారు. చినుకు పడితే చీకటిగా మారే గ్రామాలు ఎన్నో ఉన్నాయి. చిన్నపాటి గాలి వర్షం పడితే చాలు కరెంట్ కట్ అవుతుంది. మరమ్మతుల పేరిట గంటల తరబడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. ప్రభుత్వ కార్యాలయాలన్నీ మండల కేంద్రంలోనే ఉన్నాయి. కరెంట్ వస్తూ పోతూ ఉండటంతో పనులు కాక ఉద్యోగ సిబ్బంది చిరాకు పడుతున్నారు. కొందుర్గు మండలం టేకులపల్లిలో ఈనెల 11వ తేదీ రాత్రి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజు పోయింది. విషయాన్ని విద్యుత్ అధికారులకు తెలిపినా పట్టించుకోలేదు. దీంతో రాత్రంతా ఆ ఊరు అంధకారంలో

మిగతా 8వ పేజీలో...

రోజుకు 10-20 సార్లు పోతుంది



రోజుకు 10-20 సార్లు కరెంట్ వస్తూ పోతుంది. దీంతో ఏం పని చేయలేక పోతున్నాం. సమయం అంతా వృథా అవుతుంది. కరెంట్ కోసం వేచి చూడాల్సి వస్తుంది. కరెంట్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తితే పట్టించుకునే వారే కరువయ్యారు. చిన్నపాటి వర్షం పడినా కరెంట్ తీస్తున్నారు. కరెంట్ పోతే ఫిర్యాదు చేస్తే గంటల తరబడి సమస్యను పరిష్కరించడం లేదు.

- వడ్ల శేఖర్‌చారి, కార్పెంటర్, చేవెళ్ల

ఉపాధి కోల్పోతున్నాం



చేవెళ్ల పట్టణ కేంద్రంలో కరెంట్ కోతలు ఘోరంగా ఉన్నాయి. విద్యుత్‌పైనే ఆధారపడి నడిచే తమ షాపు కోతల కారణంగా నిత్యం అంతరాయం ఏర్పడుతుంది. రోజులో కనీసం పది సార్లు విద్యుత్ పోతుంది. వస్తుంది. కరెంట్ కోతలతో ఉపాధి కోల్పోతున్నాం. విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలి.

సీహెచ్. శ్రీనివాస్, లాండ్రీషాప్, చేవెళ్ల


మాట్లాడుతున్న ఈటల రాజేందర్

రైతుల జోలికొస్తే.. ఖబడ్దార్

అన్నదాతలతో పెట్టుకున్న వారెవరూ బాగు పడలేదు

పేదలను రోడ్డుపాలు చేస్తే ఊరుకోం

రియల్ ఎస్టేట్ బ్రోకర్‌లా వ్యవహరిస్తున్న ప్రభుత్వం

రైతులకు న్యాయం జరిగేంత వరకు అండగా ఉంటా

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

ఎన్కేపల్లి భూ నిర్వాసితులకు సంఘీభావం

రంగారెడ్డి అర్బన్/మొయినాబాద్/మొయినాబాద్ రూరల్, జూలై 14 (ఆంధ్యజ్యోతి) : "రైతుల భూముల జోలికొస్తే ఖబడ్దార్.. వారితో పెట్టుకున్నోడు ఎవరూ బాగుపడలేదు.. పేదలను రోడ్డుపాలు చేస్తే ఊరుకునేది లేదు" అని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని ఎన్కేపల్లి గోశాల నిర్మిస్తున్న స్థలంలో భూబాధితులు చేపట్టిన రిలే దీక్ష 8వ రోజుకు చేరుకుంది. మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం ఆధ్వర్యంలో సోమవారం ఈటల రాజేందర్ దీక్షకు సంఘీభావం తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గోశాల నిర్మాణం కోసం రైతులు సాగు చేసుకుంటున్న భూములను ప్రభుత్వం అన్యాయంగా లాక్కుందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ బ్రోకర్‌లా వ్యవహరిస్తుందని విమర్శించారు. తరతరాలుగా ఈ భూమినే నమ్ముకుని వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్న కుటుంబాలను రోడ్డుపాలు చేస్తే సహించేది లేదన్నారు. అరకొర పరిహారం ఇచ్చి కోట్ల రూపాయల విలువైన భూములు లాక్కునే ప్రయత్నం మానుకోవాలని హెచ్చరించారు. ప్రభుత్వం తీసుకున్న భూములు తిరిగి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. పన్నెండేళ్ల పాటు ప్రభుత్వ భూమిలో సాగు చేసుకుంటే వారికే పట్టాలు ఇవ్వాలనేది రెవెన్యూ చట్టంలో ఉందని గుర్తు చేశారు. ఎన్కేపల్లి రైతులు 50 ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్న భూములను లాక్కోవడం రెవెన్యూ చట్టానికి విరుద్ధమని తెలిపారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎవరికీ తెలియకుండా ప్రభుత్వ, అసైన్డ్ భూములను అక్రమంగా ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టిందని ఆరోపించారు. ఫార్మసీల పేరిట భూములు తీసుకొని ఇప్పటి వరకు రైతులకు పరిహారం ఇవ్వలేదని, మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడలో ఇదే జరిగిందని తెలిపారు. కోట్ల రూపాయల విలువైన భూములను ఇచ్చి అదే కంపెనీలో కూలీలుగా పనిచేస్తున్నారని తెలిపారు. తాను గతంలో అనేక భూ పోరాటాలు చేశానని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నప్పుడు పేదలకు జరిగే అన్యాయాన్ని అప్పట్లోనే వ్యతిరేకించానని గుర్తుచేశారు. గోశాల నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని, సీఎం తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్కేపల్లి పేదలకు న్యాయం చేసేంత వరకు బీజేపీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అక్కడి వచ్చిన వారికి భోజనాలు తీసుకువస్తున్న వాహనాన్ని పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. వెంటనే మాజీ ఎమ్మెల్యే కేఎస్. రత్నం నచ్చజెప్పడంతో రైతులు శాంతించారు. కార్యక్రమంలో నాయకులు జీ. వెంకట్‌రెడ్డి, అందెల బాబయ్య, ఎల్గని వెంకటేష్ గౌడ్, గున్నాల గోపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీకాంత్, శ్రీనివాస్ గౌడ్, ప్రశాంత్ గౌడ్, ప్రభాకర్ యాదవ్, రైతులు సికిందర్, డప్పు రమేష్, ఈశ్వర్, రైతులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో 152 ఫిర్యాదులు


ఇల్లు కట్టుకునేందుకు అనుమతి ఇవ్వాలని కలెక్టర్‌ను కోరుతున్న బాధితుడు

రంగారెడ్డి అర్బన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులకు ఎప్పటికప్పుడు పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సి. నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 152 ఫిర్యాదులు వచ్చాయి. అత్యధికంగా రెవెన్యూశాఖ నుంచి 130, ఇతర శాఖలకు సంబంధించి 22 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, డీఆర్వో సంగీత, తదితరులున్నారు.

ఇంటి నిర్మాణానికి అనుమతి ఇవ్వండి సారూ..

ఇంటి నిర్మాణం కోసం అనుమతి ఇవ్వాలని షాబాద్ మండలం ముద్దెంగూడ గ్రామానికి చెందిన బుర్రకాయల భిక్షపతి కలెక్టర్‌ను వేడుకున్నారు. భార్య పిల్లలతో వెళ్లి కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. తనకు పూరి గుడిసె ఉందని, 35 ఏళ్లుగా అందులోనే జీవనం సాగించడం జరిగిందన్నారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో ఉన్న గుడిసె తొలగించి ఆ స్థానంలో ఇల్లు నిర్మించుకునేందుకు ముగ్గు పోయడం జరిగిందన్నారు. ఈ స్థలం తనదంటూ.. అక్కడ ఇల్లు కట్టరాదని గ్రామానికి

మిగతా 8వ పేజీలో...

అభివృద్ధి పనులు ప్రారంభించండి

- ఇంటర్ బోర్డు కమిషనర్‌కు ప్రొఫెసర్ హరగోపాల్ వినతి


కృష్ణ ఆదిత్యకు వినతి పత్రం ఇస్తున్న హరగోపాల్

షాద్‌నగర్‌రూరల్,జూలై14(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అభివృద్ధి పనులు ప్రారంభించాలని ఇంటర్ బోర్డు కమిషనర్ కృష్ణ ఆదిత్యకు సోమవారం ప్రొఫెసర్ హరగోపాల్, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు శ్యాంసుందర్, మల్లేష్‌లు వినతి పత్రం ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి గ్రామాన్ని సందర్శించినప్పుడు గ్రామస్తుల వినతి మేరకు కళాశాలలో అదనపు గదుల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తామని మాటిచ్చారని తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు రూ.50 లక్షలు మంజూరు చేశారని వివరించారు. ఆ నిధులతో కళాశాలలో అదనపు గదులు నిర్మిస్తే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కళాశాలలో కెమిస్ట్రీ అధ్యాపకుడి పోస్టు ఖాళీగా ఉందని, దానిని భర్తీ చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన వారు నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

షాబాద్ బాలుర స్కూల్ హెచ్‌ఎంపై చర్యలు

విద్యార్థిని బూటు కాలితో తన్నిన హెచ్‌ఎం గోవింద్

విచారణకు ఆదేశించిన డీఈవో

7

కిచెన్ గార్డెన్‌తో మెరుగైన ఆరోగ్యం

కొండా లక్ష్మణ్ వ్యవసాయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ దండర్ రాజిరెడ్డి

7

దేశానికి తెలంగాణనే ఆయిల్ ఇవ్వాలి

ఆయిల్‌పామ్ సాగులో రాష్ట్రాన్ని మొదటి స్థానానికి తీసుకొస్తాం

కేంద్రం పామాయిల్‌పై దిగుమతి సుంకం పెంచాలి

తెలుగు రాష్ట్రాల్లో పంటలకు అవకాశం

ఒక్కసారి నాటితే 40 సంవత్సరాలు పంట

రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు


ఆయిల్ పామ్ మొక్కను నాటుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, పక్కన పట్నం మహేందర్‌రెడ్డి, కాలె యాదయ్య, తదితరులు

షాబాద్, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగులో దేశంలోనే తెలంగాణను అగ్రగామిగా చేస్తామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. రంగారెడ్డి షాబాద్ మండల పరిధిలోని పెదవేడు గ్రామంలో వీసరి అనితాసురేందర్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో మోగా ప్లాంటేషన్ కార్యక్రమంలో ప్రభుత్వ శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భారతదేశం ప్రతీ సంవత్సరం వంద లక్షల మెట్రిక్ టన్నుల పామ్ ఆయిల్‌ను దిగుమతి చేసుకుంటుందన్నారు. తద్వారా ఇక్కడి సంపద ఇతర దేశాలకు వెళ్తుందన్నారు. దేశానికి అవసమయ్యే పామ్ ఆయిల్ తోటలను తెలంగాణలోనే సాగు చేసే విధంగా రైతులను ప్రోత్సహిస్తున్నామన్నారు. ఇప్పటికే మన రాష్ట్రంలో 3లక్షల ఎకరాల ఆయిల్ పామ్ సాగు అవుతుందని, విడతల వారీగా 20 లక్షల ఎకరాల సాగు పెంపునకు ప్రణాళికలు తయారు చేశామన్నారు. రాబోయే రోజుల్లో హైదరాబాద్ చుట్టూ రీజినల్ రింగ్ రోడ్డు నిర్మించనున్నట్లు దాంతో చుట్టుపక్క ప్రాంతాలు

మిగతా 8వ పేజీలో...

కబ్జాలపై కంటితుడుపు చర్యలు

- దాతర్ చెరువులో కట్టడాల తొలగింపు
- రాచకాల్వలో తొలగించని పైపులైన్
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై కదిలిన యంత్రాంగం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


రాచకాల్వలో మట్టి తొలగింపు

ఆదిభట్ల, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల మున్సిపల్ పరిధిలోని పులందరీ, రాచకాల్వ(పిరంగి) కాలువలు కబ్జా కోరల్లో చిక్కుకున్నాయని ఈ నెల 12న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఇబ్రహీంపట్నం ఇరిగేషన్ అధికారులు స్పందించారు. ఇరిగేషన్ డీఈ ఆదేశాల మేరకు వర్క్ ఇన్‌స్పెక్టర్ సాయికుమార్ సోమవారం కొంగరకలాన్‌లోని దాతర్ చెరువును సందర్శించి కాల్వలో రాయితో నిర్మిస్తున్న కట్టడాలను జేసీబీ సహాయంతో కూల్చివేశారు. అనంతరం ఎంపీపటేల్ గూడ ఓఆర్ఆర్ సర్వీసు రోడ్డు సమీపంలోని రాచకాల్వ(పిరంగి)లో అడ్డంగా వేసిన పైపులైన్‌ను తొలగించాకుండా జేసీబీతో మట్టిని తీయించారు. అధికారులు చేపట్టిన కంటి తుడుపు చర్యలకు స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాచకాల్వ, పులందరీ కాలువలు అడుగడుగునా ఆక్రమణలకు గురైతే నామమాత్రంగా చర్యలు తీసుకోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అక్రమంగా వంతెనలు, పైపులైన్‌లను కూల్చకుండా వదిలేసి తమ పని అయిపోయిందని చేతులు దులుపేసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

న్యాయ విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలి

- నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణ దేవరావు



శ్రీకృష్ణదేవరావుకు జ్ఞాపికను అందిస్తున్న కళాశాల ప్రొఫెసర్లు

శంకర్‌పల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : న్యాయ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదవాలని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణ దేవ రావు తెలిపారు. సోమవారం శంకర్‌పల్లి మండల పరిధిలోని ఇక్ఫాయ్ కళాశాలలోని న్యాయ విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కృష్ణ దేవరావు మాట్లాడుతూ.. న్యాయ విద్య వృత్తిపరమైన సామాజిక పరివర్తనకు ఒక సాధనమని చెప్పారు. విద్యార్థులు జ్ఞానాన్ని అన్వేషించేందుకు ముందుకు సాగాలన్నారు. న్యాయ పట్టభద్రులు ప్రపంచ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సైబర్ చట్టం, మానవ హక్కులు, పర్యావరణ న్యాయం తదితర వాటిపై ఆసక్తిని పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇక్ఫాయ్ కళాశాల ప్రొఫెసర్ రవిశేఖర్‌రాజు, ఎల్ఎస్. గణేష్, అధ్యాపకులు, న్యాయవిద్యార్థులు ఉన్నారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు



కొండాపూర్‌లో శంకుస్థాపన కార్యక్రమంలో వజ్రేష్, సుధీర్‌రెడ్డి

ఘట్‌కేసర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఇళ్లులేని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని అంబేడ్కర్ నగర్, కొండాపూర్, గుంటిగూడెంలలో ఇందిరమ్మ ఇళ్లకు సోమవారం వారు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో మహేష్‌గౌడ్, ముల్లి పావని, ముత్యాలు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు స్థానికులు పాల్గొన్నారు.


ఘట్‌కేసర్ రూరల్: ఇందిరమ్మ రాజ్యమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గాయరు విశ్వనాథం తెలిపారు. ఎదులాబాద్‌లో 11 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్‌ను సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బింగి రాజేందర్‌గౌడ్, మెట్టు నర్సింహ, బొంత రాజిరెడ్డి, నవీన్ పాల్గొన్నారు.














గురుకులంలో వసతులు కల్పించాలని ఆందోళన



బీసీ గురుకుల పాఠశాల ఎదుట బైఠాయించిన విద్యార్థులు

శామీర్‌పేట, జూలై 14(ఆంధ్రజ్యోతి): పాఠశాల, కళాశాలల్లో కనీస వసతుల్లేక, సరైన భోజనం లేక నరకయాతన అనుభవిస్తున్నామని గురుకుల విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని తుర్కపల్లిలో నిర్వహిస్తున్న కూకట్‌పల్లి జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులు సోమవారం పాఠశాల ముందు, రాజీవ్ రహదారిలో ఆందోళన చేశారు. ప్రిన్సిపల్, అధ్యాపకులు డౌన్ డౌన్ అని నినాదాలు చేస్తు బైఠాయించారు. గురుకులంలో సరైన వసతుల్లేవని ప్రిన్సిపాల్, అధ్యాపకులకు చెబితే తమను దూషిస్తున్నారని విద్యార్థులు తెలిపారు. నాణ్యమైన భోజన పెట్టడం లేదని, నీటి సమస్య ఉందని, అపరిశుభ్ర తాగు నీరు ఇస్తున్నారని, బాత్‌రూమ్‌లు సరిగ్గా లేవని చెప్పారు. సమస్యలపై రెండు నెలలుగా ప్రిన్సిపాల్‌కు, అధ్యాపకులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదని, విద్యార్థులు వాపోయారు. నెలకోసారి మార్చాల్సిన ఫుడ్ మెనునూ మార్చడం లేదని, బాత్ రూమ్‌లకు డోర్లు లేవని, 500మంది విద్యార్థులకు రెండే వాష్‌రూములున్నాయని చెప్పారు. అధికారులు స్పందించి గురుకులంలో సమస్యలను వెంటనే పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని విద్యార్థులు అన్నారు. కాగా విద్యార్థుల ఆందోళనకు స్థానిక బీఆర్ఎస్ నాయకులు మద్దతిచ్చారు. ప్రభుత్వ గురుకులాల్లో సమస్యలన్నీ తీర్చుతున్నామని చెబుతున్న పాలకులు, అధికారులు మరి వీరి సమస్యలు ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



గెస్ట్ టాక్ కార్యక్రమంలో రోడ్లు, భవనాల శాఖ చీఫ్ ఇంజినీర్ రైమల్

ఘట్‌కేసర్ రూరల్ జూలై 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని రోడ్లు, భవనాల శాఖ చీఫ్ ఇంజినీర్ రైమల్ అన్నారు. ఘనాపూర్‌లోని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన గెస్ట్ టాక్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సివిల్ ఇంజినీరింగ్ రంగంలో వస్తున్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రాజెక్ట్ నిర్వహణ, ప్రాక్టికల్ నాలెడ్జ్, ప్రాముఖ్యాన్ని తెలుసుకోవాలన్నారు. పట్టుదల, క్రమశిక్షణతో చదివితేనే ఫలితాలు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సుధీర్‌ప్రేమ్‌కుమార్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనాధ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హాస్టల్లో అందించే భోజనం పట్ల నిర్లక్ష్యం వహించొద్దు



విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు

మర్పల్లి, జూలై 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అందించే భోజనం పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మండల ప్రత్యేకాధికారి కృష్ణమోహన్ అన్నారు. ఆదివారం సిరిపూరం ఎస్సీ బాలుర హాస్టల్‌లో భోజనంలో పురుగులు వచ్చాయని విద్యార్థుల తల్లిదండ్రులు సిబ్బంది, వార్డెన్‌పై మండిపడ్డారు. సోమవారం ప్రత్యేకాధికారి, తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీవో రాజమల్లయ్య హాస్టల్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం నాణ్యత, సదుపాయాలపై అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందించని పక్షంలో చర్యలు తీసుకుంటామని హాస్టల్ వార్డెన్ తుల్జారాం, సిబ్బందిని హెచ్చరించారు.

ఊరూరా మహిళా శక్తి సంబురాలు



కార్యక్రమంలో మహిళను సన్మానిస్తున్న అధికారులు

పెద్దేముల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలో ఊరురా ఇందిరా మహిళా శక్తి సంబురాల కార్యక్రమాన్ని సోమవారం జరుపుకున్నారు.ఐకేపీ కార్యాలయంలో మహిళలను సన్మానించారు. ఐకేపీ ఏపీఎం బాలయ్య మట్లాడుతూ.. ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా ప్రభుత్వం ప్రతీ మహిళా సంఘానికి రూ.20లక్షల వరకు వడ్డీలేని రుణాలు ఇస్తుందని తెలిపారు. మహిళల ఉపాధి కోసం చిరు వ్యాపారాలకు స్త్రీ నిధి రుణాలు ఇస్తుందని చెప్పారు. మహిళా సంఘాలకు పెట్రోల్ బంకుల నిర్వహణ, క్యాంటీన్లు, ఆర్టీసీ అద్దె బస్సులు, కిరాణషాపుల నిర్వహణకు రుణాలు ఇస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐకేపీ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన కల్పించాలి



వ్యవసాయ క్షేత్రంలో నాట్లు వేస్తున్న విద్యార్థులు

ఆదిభట్ల, జూలై 14(ఆంధ్రజ్యోతి):విద్యార్థులకు విద్యతో పాటు వ్యవసాయంపై అవగాహన కల్పించాలని శ్రీనివాస స్కూల్ చైర్మన్ శ్రీనివాస్‌రావు అన్నారు. సోమవారం కొంగరకలాన్‌లోని ఓ వ్యవసాయ క్షేత్రంలో విద్యార్థులకు వరినాట్లపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు పాఠ్యపుస్తకాల్లో ఉండే బోధనలతో పాటు క్షేత్రస్థాయి పరిజ్ఞానం అవసరమన్నారు. తమ స్కూల్ విద్యార్థులకు ఏటా వరినాట్లపై, పంటలపై అవగాహన కల్పించి, వరి నాట్లు వేయిస్తున్నట్టు తెలిపారు. అనంతరం రైతులు పడే కష్టాలు, పంటలు పండించే కాలాల గురించి వివరించామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్కరాజు రాధిక, టీచర్ సౌజన్య, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ఇళ్లు నిర్మించుకోవాలి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



తుమ్మలపల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

చౌదరిగూడ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల మేరకే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ సూచించారు. సోమవారం తుమ్మలపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలించారు. 'ఇందిరమ్మకు ఇసుక కష్టాలు' శీర్షికన శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఇళ్ల నిర్మాణానికి స్టోన్‌డస్ట్ వాడుతున్నారని తెలిసి అధికారులు పరిశీలించారు. స్థానికంగా లభించే ఇసుకను ఉచితంగానే వాడుకోవచ్చని, ఇసుకతోనే నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు.

ఎన్నికల నిర్వహణలో బీఎల్వోలది కీలక పాత్ర



మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనునాయక్

కడ్తాల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిర్వహణ, ఓటర్ లిస్టుల రూపకల్పనలతో బూత్ లెవల్ ఆఫీసర్లది కీలకపాత్ర అని కల్వకుర్తి ఆర్డీవో శ్రీనునాయక్ అన్నారు. బీఎల్‌వోలు ఎక్కడా అలసత్వానికి తావివ్వొద్దని సూచించారు. సోమవారం కడ్తాల్‌లోని రైతు వేదికలో బూత్ స్థాయి అధికారులకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. బీఎల్‌వోలకు నియోజకవర్గ స్థాయి శిక్షకులు జంగయ్య, శ్రీనివాస్‌లు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యత



తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్ వెంకట్‌రెడ్డి

కీసర, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఇంటి పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలని దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి అన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా సోమవారం పరిధి కీసరలో కమిషనర్ తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగహన కల్పించారు. షాపుల చెత్త రోడ్లపై వేయకూడదని దుకాణదారులను హెచ్చరించారు. అంబేడ్కర్ చౌరస్తా వద్ద మానవహారం చేపట్టి ప్రతిజ్ఞ చేయించారు. శివాజీ చౌరస్తా కాలనీ వాసులు తాగునీటి ఇబ్బందులు తీర్చాలని డ్రమ్ములు రోడ్డుపై పెట్టి నిరసన వ్యక్తం చేశారు. స్పందించిన కమిషనర్ నీటి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సీఎస్‌ను కలిసిన రాఘవేందర్



కడ్తాల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును కడ్తాలకు చెందిన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోళ్ల రాఘవేందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో రామకృష్ణారావును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. స్థానిక సమస్యలను సీఎస్ దృష్టికి తీసుకెళ్లినట్టు రాఘవేందర్ తెలిపారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేయకుంటే ఆందోళనలే

షాబాద్, జూలై 14(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలుచేశాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని బీఆర్ఎస్ నాయకుడు నక్క శ్రీనివాస్‌గౌడ్, జడల రాజేందర్‌గౌడ్ అన్నారు. సోమవారం షాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మభ్యపెట్టేందుకే బీసీ రిజర్వేషన్ల అంశంపై రోజుకో మాట మాట్లాడుతోందని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కల్వకోల్ వెంకట్‌యాదవ్, నాయకులు పోనెమోని రమేష్‌యాదవ్, కమ్మరి శ్రీనివాస్, చాంద్‌పాషా, గణేష్‌గౌడ్, శేఖర్, దర్శన్, రాజుగౌడ్, ముభ్రంఖాన్, ఇమ్రాన్, సురేష్‌గౌడ్, సత్తయ్య తదితరుల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

చేవెళ్ల, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం చేవెళ్లలోని హైదరాబాద్-బీజాపూర్ రహదారిపై విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎర్రవల్లి శ్రీనివాస్, అరుణ్‌కుమార్‌లు మాట్లాడుతూ... పెండింగ్‌లోని రూ. 8,700కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు. విద్యాభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. కార్యక్రమంలో సమీర్, యశ్వంత్, చరణ్‌గౌడ్, చందు, తేజ, చిరంజీవి, ప్రశాంత్, ఆకాశ్, సోఫియాస్, మెసిన్, ఆజర్, వంశీ, సాయి పాల్గొన్నారు.



చేవెళ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, నాయకులు


వీవీ వినాయక్‌తో స్థానికులు

శంకర్‌పల్లి ఎస్సార్వోకు డైరెక్టర్ వీవీ.వినాయక్ రాక

శంకర్‌పల్లి, జూలై 14(ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సోమవారం సినిమా డైరెక్టర్ వీవీ.వినాయక్ వచ్చారు. మొయినాబాద్ మండలం చిన్నమంగళారంలో తనకున్న 2,000 గజాల స్థలాన్ని వినాయక్ హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తికి విక్రయించారు. ఆ ప్లాట్ రిజిస్ట్రేషన్ నిమిత్తం వినాయక్ శంకర్‌పల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన అనంతరం వినాయక్ హైదరబాద్ వెళ్లిపోయారు. కాగా కార్యాలయం వద్ద డైరెక్టర్‌తో ఫొటోలు, సెల్ఫీలు దిగేందుకు యువకులు, స్థానికులు ఉత్సాహం చూపారు.


సమావేశంలో మాట్లాడుతున్న పోతుగంటి కృష్ణ

పింఛన్‌దారుల మహాసభను విజయవంతం చేయాలి

తలకొండపల్లి, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న ఆమనగల్లులో నిర్వహించే చేయూత పింఛన్‌దారుల మహాసభను విజయవంత చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణ మాదిగ అన్నారు. సోమవారం తలకొండపల్లిలో ఆసరా పింఛన్‌దారులు, దివ్యాంగుల సంఘం నాయకులతో ఎమ్మార్పీఎస్ నాయకులు సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణ మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ ఆదేశాల మేరకు సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు జంగయ్య, శ్రీకాంత్, గోపాల్, పింఛన్‌దారులు పాల్గొన్నారు.

పురాతన వెండి ఆభరణాలు లభ్యం

» పాత ఇంటిని కూల్చుతుండగా బయల్పడిన వైనం

మర్పల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి పాత ఇంటిని తొలగిస్తుండగా పాత గోడల్లో 1.23కిలోల పరిమాణంలో పురాతన వెండి ఆభరణాలు లభ్యమయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. బూచన్‌పల్లిలో లక్ష్మీపూరం జనార్ధన్‌రెడ్డికి ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఇంటి నిర్మాణానికి అతడు శనివారం ఇంటిని జేసీబీతో కూల్చి వేస్తుండగా వెండి కాళ్ల పట్టీలు, వడ్డాణం లభ్యమయ్యాయి. దీంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు చేరుకొని జనార్ధన్‌రెడ్డి ప్రశ్నించగా అతడు పురాతణ ఆభరణాలను పోలీసులకు అప్పగించాడు. స్వాధీనం చేసుకున్న వెండిని సోమవారం ఎస్‌ఐ గఫ్పార్ తహసీల్దార్ పురుషోత్తంకు అప్పగించారు. ఈ విషయమై జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్ తెలిపారు.


లభ్యమైన వెండి ఆభరణాలు


కిచెన్ గార్డెన్‌ను ప్రారంభిస్తున్న రాజిరెడ్డి, లీలాలక్ష్మారెడ్డి, రజనీకుమారి

కిచెన్ గార్డెన్‌తో మెరుగైన ఆరోగ్యం

» కొండా లక్ష్మణ్ వ్యవసాయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ దండర్ రాజిరెడ్డి

శంషాబాద్ రూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారం అందడం తోపాటు సరైన జీవన శైలి అలవాటవుతుందని కొండా లక్ష్మణ్ వ్యవసాయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ దండర్ రాజిరెడ్డి, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ అధ్యక్షురాలు లీలాలక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం శంషాబాద్ మండలంలోని పాలమాకుల మోడల్ స్కూల్‌లో యాంగ్ ఎర్త్ లీడర్స్, స్కూల్ ఎర్త్ క్లబ్స్ ఆధ్వర్యంలో కిచెన్ గార్డెన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు పౌష్టికాహారం ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రజనీకుమారి, ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యు భగవాన్, చీనానాయక్, మహీధర, పంకజ్‌రెడ్డి, జీవీ.సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జయేందర్, సురేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, లక్ష్మీనర్సింహారెడ్డి

బీసీ రిజర్వేషన్లపై ప్రధానితో చర్చించని సీఎం

కందుకూరు, జులై14(ఆంధ్రజ్యోతి): బీసీల ఐక్యత వర్ధిల్లాలని, రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కల్పించాలని సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్, ఏఎంసీ మాజీ చైర్మన్ సురేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నె జయేందర్ ఆధ్వర్యంలో కందుకూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తరచూ ఢిల్లీ వెళ్తున్న సీఎం రేవంత్‌రెడ్డి బీసీల 42శాతం రిజర్వేషన్లపై ఒక్కసారైనా ప్రధానమంత్రితో చర్చించకపోవడం వింతగా ఉందన్నారు. ఏ చట్టం ప్రకారం బీసీలకు 42శాతం రిజర్వేషన్లిస్తారో చెప్పడం లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే దమ్ములేకనే బీసీలకు 42శాతం రిజర్వేషన్లంటూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో నాయకులు డి.జంగయ్య, కె.సదానందగౌడ్, అశోక్, శ్రీహరి, పర్వతాలు, తాళ్ల కార్తీక్, తిరుపతయ్య, ప్రశాంత్‌చారి, శివలింగచారి, రాజు, నర్సింహ, సత్తయ్య పాల్గొన్నారు.

ఆషాఢం.. మహిళల మురిపెం

కొడంగల్ రూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం వచ్చిందంటే మహిళలు, యువతులు, చిన్నారులు చేతులు, కాళ్లకు గోరింటాకు పెట్టుకోవడం సంప్రదాయం. అరచేతిలో ఎర్ర మందారంలా పండి, తన బతుకును పండించే మంచి భర్త రావాలని యువతులు గోరింటాకు పెట్టుకుంటారు. చేతులు, పాదాలను ఎరుపెక్కించే గోరింట.. అందంతో పాటు ఆరోగ్యాన్నీ ప్రసాదిస్తుంది. అందుకే గోరింటాకంటే ఇష్టపడని మహిళలు ఉండరు. గోరింట లేత ఆకులను రోలులో రుబ్బి చేతులకు, పాదాలకు పెట్టుకుంటారు. కొన్ని గంటల్లోనే ఎర్రగా పండి చేతులు, కాళ్లకు వన్నె తెస్తుంది. అయితే ప్రస్తుతం చాలా మంది రెడీమేడ్ కోన్ మెహందీని వాడుతున్నారు. పల్లెల్లో మాత్రం ఇప్పటికీ పాత సంప్రదాయం ప్రకారమే గోరింటాకును రోలులో రుబ్బి చేతులు, పాదాలకు పెట్టుకుంటున్నారు.

ఈ కాలంలోనే ఎందుకంటే..?

ఆషాఢ అంటేనే వర్షా కాలం. ఈ సమయంలో నేలంతా బురద మయంగా ఉంటుంది. నిత్యం ఇంటి పనుల్లో తలమున కలయ్యే మహిళలు తడి నేలపై పదేపదే తిరుగుతారు. దీంతో నేలలో ఉండే తేమతో మహిళల చేతులు, కాళ్ల ఒరిసిపోయి గోళ్ల దెబ్బతింటాయి. ఇలా వచ్చే కొన్ని సమస్యలకు గోరింటాకు విరుగుడుగా పనిచేస్తుందని నమ్మకం. అలాగే శరీరంలోని వేడిని తగ్గించేందుకు సైతం గోరింట దోహదపడుతుంది.


కొడంగల్‌లో గోరింటాకు వేడుక నిర్వహిస్తున్న మహిళలు

వడివడిగా బ్రిడ్జి పనులు

» ఘట్‌కేసర్‌లో జాతీయ రహదారిపై ట్రాఫిక్ డైవర్షన్ కోసం రోడ్ల నిర్మాణం
» వాహనదారులకు తొలగనున్న తిప్పలు
» హైవే దాటేందుకు తీరనున్న ఇబ్బందులు

ఘట్‌కేసర్, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లోని ఔటర్ జంక్షన్ వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఘట్‌కేసర్‌లోని యంనంపేట్ చౌరస్తా వద్ద హైదరాబాద్-వరంగల్ హైవేను దాటేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ సమస్యలూ తలెత్తుతున్నాయి. హైవేను దాటే సమయాల్లో ఇక్కడ ఎన్నోప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని స్థానిక నాయకులు ఎంపీలు కె.లక్ష్మణ్, ఈటల రాజేందర్‌లకు తెలుపగా వారు కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరి దృష్టికి తీసుకుపోయారు. దీంతో నేషనల్ హైవే అథారిటీ అధికారులు పరిశీలించి ఒక బ్రిడ్జి, మూడు వీయూపీ(వెహికిల్ అండర్ పాస్)ల నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. రూ.102కోట్లతో పనులు చేపట్టారు. హైదరాబాద్-వరంగల్ రహదారిని దాటేందుకు ఇరు పక్కల వాహనదారులకు ఇబ్బందుల్లేకుండా బ్రిడ్జి నిర్మాణానికి రూపకల్పన చేశారు. ఘట్‌కేసర్ వైపునకు వెళ్లాల్సిన వాహనాలు ఘట్‌కేసర్ వైపు, హైదరాబాద్ వైపునుంచి వరంగల్ వెళ్లే వాహనాలు జాతీయ రహదారిపైకి చేరుకునేలా ప్రణాళిక రూపొందించారు.


ఘట్‌కేసర్ ఔటర్ జంక్షన్‌లో వాహనాల డైవర్షన్ కోసం రోడ్డు పనులు


చేపడుతున్న పనులపై ఆరా తీస్తున్న ఎంపీ కె.లక్ష్మణ్(ఫైల్)

ప్రమాదాలు తగ్గే అవకాశం

హైవేపై బ్రిడ్జి నిర్మాణానికి టెండర్ పూర్తికావడంతో కాంట్రాక్టర్ పనులను ప్రారంభించారు. మొదట వాహనాలను మళ్లించేందుకు రెండు వైపులా అండర్ పాస్‌లను వేస్తున్నారు. బ్రిడ్జి నిర్మించే ఔటర్ సమీపం నుంచి పనులు చేపట్టారు. మైసమ్మగుట్ట కాలనీకి వెళ్లేందుకు ఈద్గా సమీపంలో అండర్ పాస్, అవుషాపూర్ వాసులు హైవేను దాటేందుకు గ్రామ చౌరస్తా వద్ద మరో వీయూపీ నిర్మిస్తారు. అన్నోజిగూడలోని ఎన్ఎఫ్‌సీ చౌరస్తా వద్ద నిర్మించే అండర్‌పాస్‌తో ప్రజలకు ఇబ్బందులు తీరుతాయి. ఇక్కడ జాతీయ రహదారిపై జరిగిన అనేక ప్రమాదాల్లో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. అండర్‌పాస్‌తో ఘనాపూర్, పక్కీర్‌టెక్యా, లింగాపూర్ ఆర్జీకే కాలనీ, దివ్యాంగులకాలనీ, మోడీ కాలనీ, పలు విద్యాసంస్థల విద్యార్థుల వాహనాలు సురక్షితంగా హైవేను క్రాస్ చేసే వీలు కలుగుతుంది. బ్రిడ్జి, మూడు అండర్‌పాస్‌ల నిర్మాణం పూర్తయితే ఇక్కడ ప్రమాదాలు తగ్గుతాయి.

ట్రాఫిక్ ఇబ్బందులు తీరుతాయి



ఘట్‌కేసర్‌లోని ఔటర్ జంక్షన్ వద్ద నిత్యం ట్రాఫిక్‌తో ఇబ్బంది పడుతున్నాం. పండుగలు, సెలవు దినాల్లో అయితే ట్రాఫిక్ మరింత తీవ్రంగా ఉంటుంది. క్రాసింగ్ సమయాల్లో హైవేపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మైసమ్మగుట్టకాలనీ చౌరస్తా, అన్నోజిగూడ ఎన్ఎఫ్‌సీ చౌరస్తాలు ప్రమాద జోన్లుగా మారాయి. బ్రిడ్జి, అండర్ పాస్‌ల నిర్మాణాలతో ఇబ్బందులు తీరుతాయి.

- ఎంబీఆర్.రాజు, శివారెడ్డిగూడ, ఘట్‌కేసర్

ఎంపీల సహకారంతోనే బ్రిడ్జి మంజూరు



ఘట్‌కేసర్‌లోని ఔటర్ చౌరస్తా, అన్నోజిగూడ ఎన్ఎఫ్‌సీ చౌరస్తా, మైసమ్మగుట్ట కాలనీ చౌరస్తా, అవుషాపూర్‌ల వద్ద అనేక ప్రమాదాలు జరిగి పలువురు చనిపోయారు. ఈ సమస్యపై ఎంపీలు కె.లక్ష్మణ్, ఈటల రాజేందర్‌ల సహకారంతో పలుమార్లు ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీకి సమస్యను వివరించాం. కేంద్రం నిధులు మంజూరు చేయడంతో పనులు ప్రారంభమయ్యాయి.

- ఏనుగు సుదర్శన్‌రెడ్డి, బీజేపీ నాయకుడు

కల్లు దుకాణాల్లో ఎక్సైజ్ తనిఖీలు

యాచారం/వికారాబాద్, జూలై 14(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో కల్తీ కల్లు తాగి కొందరు మరణించిన నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ అధికారులు కల్లు దుకాణాల తనిఖీలను ముమ్మరం చేశారు. సోమవారం యాచారం మండల పలు గ్రామాల్లో దుకాణాలను తనిఖీ చేశారు. చెట్ల నుంచి తీసిన కల్లు విక్రయిస్తున్నట్టు తమ పరీక్షల్లో తేలిందని ఇబ్రహీంపట్నం ఎక్సైజ్ సీఐ సీతారాం రెడ్డి తెలిపారు. కల్లు తయారీదారులు, డిపో నిర్వాహకులు నిబంధనలు పాటించాలని, కల్తీకల్లు, రసాయనాలు కలిపిన కల్లును విక్రయించొద్దని వికారాబాద్ ఎక్సైజ్ సీఐ రాఘవీణ తెలిపారు. పట్టణంలోని కల్లు డిపోను తనిఖీ చేశారు. కల్లు క్లోరల్ హైడ్రేడ్ రహితంగా ఉందని నిర్ధారించారు. రెండు సీసాల శాంపిళ్లను సేకరించి అండర్ రూల్-27 ప్రకారం కేసు నమోదు చేశామని తెలిపారు. శాంపిళ్లను టెస్టుల కోసం నారాయణగూడ ల్యాబ్‌కు పంపుతామన్నారు. కల్లుతో మత్తుపదార్థాలు వాడినట్లు నిర్ధారణైతే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ.. ధారాసింగ్‌కు నోటీసులు

తాండూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో భాగంగా ఈ నెల 15వ తేదీన హాజరుకావాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్‌కు జూబ్లీహిల్స్ డివిజన్ అసిస్టెంట్ పోలీస్‌కమిషనర్ వెంకటగిరి నోటీసులు జారీ చేశారు. గతంలో విచారణకు రావాలని ఫోన్ ద్వారా జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ నుంచి పిలుపు వచ్చినప్పటికీ నోటీసేమీ రాలేదనే ఉద్దేశంతో ధారాసింగ్ విచారణకు వెళ్లలేదు. 2023 శాసనసభ ఎన్నికల ముందు ఆయన ఫోన్ ట్యాప్ అయినట్టు అధికారులు గుర్తించడంతో తాజాగా నోటీసులు జారీ చేశారు.

షాబాద్ బాలుర పాఠశాల హెచ్‌ఎంపై చర్యలు

» విద్యార్థిని బూటు కాలితో తన్నిన హెచ్‌ఎం గోవింద్
» విచారణకు ఆదేశించిన డీఈవో

షాబాద్, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఆరో తరగతి విద్యార్థిని చితకబాది, బూటు కాలితో తన్నిన షాబాద్‌లోని బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవింద్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు తెలిపారు. ఈ నెల 11న విద్యార్థిని చితకబాదిన సంఘటనతో బాలుడి కుటుంబీకులు, కొందరు గ్రామస్తులు సోమవారం పాఠశాలకు చేరుకొని.. 'ఈ హెచ్‌ఎం మాకొద్దు.' అని నినాదాలు చేశారు. హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని డీఈవోకు ఫోన్ చేయగా ఆయన పాఠశాలకు చేరుకొని గ్రామస్తులతో చర్చించారు. అనంతరం డీఈవో విలేకరులతో మాట్లాడుతూ... హెచ్‌ఎం గోవింద్‌పై ఇప్పటికే చాలా ఫిర్యాదులొచ్చాయని, పాఠశాల ఫర్నిచర్ విక్రయించాడని, ఆరో తరగతి విద్యార్థిని బూట్ కాలితో తన్ని హింసించాడని గ్రామస్తులు ఫిర్యాదు చేశారని డీఈవో తెలిపారు. ఆరోపణలపై హెచ్‌ఎం గోవింద్‌ను వివరణ కోరగా పొంతన లేని సమాధానాల చెప్పాడని డీఈవో చెప్పారు. అతడి చర్యలపై విచారణకు ఆదేశించామన్నారు. అతడి తప్పులు తేలితే చర్యలు తీసుకుంటామని చెప్పారు. అప్పటి వరకు ఇన్‌చార్జి హెచ్‌ఎంగా వేరొక ఉపాధ్యాయుడిని నియమిస్తున్నట్లు తెలిపారు. అనంతరం డీఈవో పట్టణంలోని బాలికల పాఠశాలను సందర్శించి టీచర్లు సమయపాలన పాటించాలని సూచించారు. ఉన్నత ప్రమాణాలతో విద్యా బోధన చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డీఈవో వెంట ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఉన్నారు.


పాఠశాల వద్ద నినాదాలు చేస్తున్న గ్రామస్తులు


మాట్లాడుతున్న డీఈవో సుశీందర్‌రావు

స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయం

తాండూరు రూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి):రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ గ్రామంలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని బీఆర్ఎస్ రాష్ట్ర మీడియా సెల్ అధికార ప్రతినిధి పంజుగుల శ్రీశైల్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి అన్నారు. సోమవారం తాండూరులో మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి నివాసంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికలు ఎప్పుడొచ్చినా కార్యకర్తలందరూ ఐక్యంగా ఉంటూ బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. ఏ పల్లెకు వెళ్లినా కేసీఆరే మళ్లా సీఎం కావాలంటూ చర్చించుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో గ్రామంలోనూ అభివృద్ధి జరగడం లేదన్నారు. క్షేత్ర స్థాయిలో నాయకులంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్ పాలనలో మోసాలు, అన్యాయాలతో విసిగిపోయిన ప్రజలు ఆ పార్టీని చిత్తుగా ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో తాండూరు మండలంలోని వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీల, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ మహిళా కన్వీనర్, యువజన విభాగం నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి

బషీరాబాద్ మోడల్ స్కూల్‌లో హెచ్‌బీటీల పంచాయితీ

» ఆరేళ్లుగా పనిచేస్తున్న తమను తొలగించారని ఆవేదన

బషీరాబాద్, జూలై 14(ఆంధ్రజ్యోతి): అవర్ బేస్డ్ టీచర్(హెచ్‌బీటీ)ల ఎంపికలో అక్రమాలు జరిగాయని పలువురు హెచ్‌బీటీలు బషీరాబాద్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అనీలతో సోమవారం గొడవకు దిగారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఎనమిది మందిని తొలగించి కొత్తగా హెచ్‌బీటీలను ఎలా తీసుకుంటారని లక్ష్మణ్ తదితరులు ప్రశ్నించారు. ఇక్కడ పనిచేస్తున్న తమను యేటా రెన్యూవల్ చేశారని, ఈ సారి కొత్త విధానమా; అని ప్రిన్సిపాల్‌తో పలువురు హెచ్‌బీటీలు వాదనకు దిగారు. తాము కూడా గతంలో డెమో క్లాసులు, ఇంటార్వ్యులతోనే ఉద్యోగాల్లోకి వచ్చామని, మరి ఎందుకు తీసేస్తున్నారని ప్రశ్నించారు. అర్హత లేకున్నా కొత్త వారిని తీసుకున్నారని, ఎంపికలోనూ అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఇక్కడ పనిచేసిన వారు కొందరు స్వచ్ఛందంగానే వెళ్లిపోయారని ప్రిన్సిపాల్ చెప్పగా.. ఉన్న వాళ్లం ఉద్యోగం చేస్తామంటే ఎందుకు అవకాశం ఇవ్వరని కొందరు అడిగారు. దీంతో ప్రిన్సిపాల్ స్పందిస్తూ.. గతంలో ఇక్కడ రెగ్యులర్ ప్రిన్సిపాల్ లేకే నిబంధనల మేరకు యేటా రిక్రూట్మెంట్ చేపట్టక పాత వారికే రెన్యూవల్ చేశారని సమాధానం చెప్పారు. తాను నిబంధనల మేరకే కొత్త హెచ్‌బీటీలను తీసుకున్నామని చెప్పారు. కాగా ఏళ్లుగా పనిచేస్తున్న తమను విధుల్లోంచి తొలగించిన ప్రిన్సిపాల్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని పాత హెచ్‌బీటీలు తెలిపారు.


తమ ఉద్యోగాలపై బషీరాబాద్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌ను ప్రశ్నిస్తున్న పాత హెచ్‌బీటీలు



ఎమ్మెల్యే, మధుసూదన్‌రెడ్డిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

కాంగ్రెస్ పాలనలోనే సమన్యాయం

షాబాద్, జూలై 14(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతోనే బడుగు, బలహీన వర్గాలకు న్యాయం చేకూరుతుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. సోమవారం హైతాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు 50మంది నాయకులు ఎమ్మెల్యే, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలోనే పేదలకు, అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతోందన్నారు. దశలవారీగా హామీలన్నీ అమలు చేస్తున్నట్టు చెప్పారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత కరెంటు, ఇందిరమ్మ ఇళ్ల వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్టు చెప్పారు. రాష్ట్ర అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి కంకణం కట్టుకున్నారని తెలిపారు. స్థానిక సంస్థ ఎన్నికలకు సన్నద్ధం కావాలని నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ ఏఎంసీ వైస్‌చైర్మన్ కె.చంద్రశేఖర్, నాయకులు జనార్దన్‌రెడ్డి, లింగం, ఖాజామియా, సంజీవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బీఆర్ఎస్‌లో చేరుతున్న వివిధ పార్టీల నాయకులు

కాంగ్రెస్‌వి ప్రజా వ్యతిరేక విధానాలు

చేవెళ్ల, జూలై 14(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని పార్టీ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు. సోమవారం ఖానాపూర్, ముడిమ్యాల్ తదితర గ్రామాల బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారందరికీ కార్తీక్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానలను అవలభిస్తుందన్నారు. కాంగ్రెస్ పాలనతో విసిగిన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని చెప్పారు. అన్ని ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిచేలా కార్యకర్తలు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పి. కృష్ణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్, నియోజకవర్గ మాజీ కన్వీనర్ డి.ఆంజనేయులు, నాయకులు శేరి శివారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, గోనె కరుణాకర్‌రెడ్డి, వనం మహేందర్‌రెడ్డి, మాణిక్యరెడ్డి, మాధవరెడ్డి, బి.నర్సింలు, నరేందర్‌రెడ్డి, కృష్ణ, టి.చంద్రశేఖర్, ఆంజనేయులుగౌడ్, నారాయణ, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యశాల ఉద్యోగికి రైతుల సన్మానం

కేశంపేట, జూలై 14(ఆంధ్రజ్యోతి): తెలంగాణ నాన్ గెజిటెడ్ వెటర్నరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన పశుసంవర్ధక శాఖ ఉద్యోగి రాజీవ్ పైలట్‌ను సోమవారం నిర్దవెల్లి రైతులు సన్మానించారు. గ్రామ పశువైద్య శాల పరిధిలో సేవలందిస్తున్న రాజీవ్ పైలట్ ఇటీవల నిర్వహించిన తెలంగాణ నాన్ గెజిటెడ్ వెటర్నరీ అసోసియేషన్ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. తమ గ్రామంలో విధులు నిర్వహిస్తున్న రాజీవ్‌కు ఉద్యోగ సంఘంలో జిల్లా అధ్యక్ష పదవి దక్కడంతో రైతుల ఆనందం వ్యక్తం చేసి ఆయనను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రైతులు దిద్దెల ముత్యాలు, పద్మోజీ, నిరంజన్, మహేందర్, బాలరాజ్, బుచ్చయ్య, శంకర్ పాల్గొన్నారు.

కరెంట్ 'కట్'కట!

(ఐదో పేజీ తరువాయి)

ఉండిపోయింది. ఏఈ, లైన్‌మెన్ స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. సిబ్బంది కొరత కారణంగా మరమ్మతులు చేయడంలో ఆలస్యం ఏర్పడుతుందంటున్నారు.

లెక్కలేని కోతలు

విద్యుత్ సరఫరా నిలిచిపోతే కారణమేంటి? ఎంత సేపట్లో పునరుద్ధరించారు వంటి వివరాలన్నీ రికార్డు చేయాలి. సబ్‌స్టేషన్‌ల వారీగా వివరాలు పొందుపర్చాలి. సాంకేతిక కారణాలతో సరఫరా నిలిచినప్పుడు మాత్రమే సబ్‌స్టేషన్ రికార్డులో నమోదు చేస్తున్నారు. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు అధికారులు రికార్డుల్లో చూపుతున్నా అనధికారిక కోతలతో ప్రజలకు బాధలు తప్పడం లేదు.

గాలికి వదిలేసిన తీగల నిర్వహణ

గాలి వీచినా, వర్షం జల్లులు కురిసినా చెట్టుకొమమ్మల వల్ల విద్యుత్ ట్రిప్ అవుతుంది. అవసరానికి తగిన విద్యుత్ సరఫరా సామర్థ్యం పెరగడం లేదు. గ్రామాల్లో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. ఇళ్ల మధ్యలో, వ్యవసాయ పొలాల్లో తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదాలను తలపిస్తున్నాయి. వాటిని సరి చేయడంలో విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

దేశానికి తెలంగాణనే ఆయిల్ ఇవ్వాలి

(ఐదో పేజీ తరువాయి)

మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. సీఎం రేవంత్ రెడ్డి గత నెలలో దావోస్ వెళ్లినప్పుడు ఆయిల్‌పామ్ సీడ్ గార్డెన్ ఉత్పత్తి కోసం గోద్రేజ్ కంపెనీతో ఒప్పందం చేసినట్లు గుర్తుచేశాడు. వచ్చే నెలలోనే సీఎం చేతులమీదుగా సిద్దిపేట జిల్లాలో ఆయిల్ పామ్ విత్తనాలతో పామాయిల్ తయారు చేసే కంపెనీని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని ఉమ్మడి 10 జిల్లాలో 10 ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కేశంపేట మండలం అల్వాల్ గ్రామంలో కూడా ఆయిల్ పామ్ ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆయిల్ పామ్ సాగు చేసే ఎకరాకు రూ. 51 వేలు రైతులకు అందిస్తుందన్నారు. పామ్ ఆయిల్ దిగుమతి సుంకంపై దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయశాఖ మంత్రులందరూ కలిసి ప్రధానమంత్రికి వినతి పత్రం ఇచ్చేందుకు నిర్ణయించామన్నారు. దిగుమతి సుంకం పెంచితే దేశంలో ఆయిల్ పామ్ పండించే రైతులకు మంచి గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. గుడిమల్కాపూర్ మార్కెట్‌ను ఔటర్ రింగ్ రోడ్ సమీపంలో అజీజ్‌నగర్ రెవెన్యూలో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఇప్పటి వరకు 3వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ పంట సాగవుతుందని, ఈ సంవత్సరం మరో 3వేల ఎకరాల విస్తీర్ణం పెంచాలన్నారు. కంపెనీ వారే మీ తోటకి వచ్చి పంటను సేకరిస్తారన్నారు. మనకు 100 లక్షల మెట్రిక్ టన్నుల ఆయిల్ అవసరమని, ప్రస్తుతం 3లక్షలు పండిస్తున్నామని, దీంతో ఇతర దేశాల నుంచి రూ.లక్షన్నర



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

కోట్లు పెట్టి ఆయిల్ దిగుమతి చేసుకుంటున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ పంట సాగు చేసే వీలుందని, కనీసం 10 నుంచి 15 లక్షల ఎకరాల్లో పంట వేసినా దేశానికి మనం ఆయిల్ సరఫరా చేయవచ్చన్నారు.

రైతుల ఆసక్తి

అనంతరం ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ... చేవెళ్ల నియోజకవర్గంలో ఆయిల్‌పామ్ పంటను సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారన్నారు. జిల్లాలో ఆయిల్ కంపెనీ పెట్టేందుకు 50 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా ఏర్పాటు చేస్తామన్నారు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో పూలు, పండ్లు, కూరగాయలు ఎక్కువగా సాగు చేస్తుంటారని, వాటిని అమ్మేందుకు నగరంలోని గుడిమల్కాపూర్ మార్కెట్‌కు రైతులు పోవాల్సి వస్తుందని, దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్ వద్ద పెద్ద మార్కెట్ ఏర్పాటు చేయాలని మంత్రి దృష్టికి తీసుకుపోయారు. చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ... జిల్లాలో ఇప్పటికే 4వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ పంటను సాగు చేశారన్నారు. రైతు భరోసా, రుణ మాఫీ ఏకకాలంలో అమలు చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. జిల్లాలో రూ.323 కోట్ల 50 లక్షల రైతు భరోసా నిధులను రైతుల ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. అదే విధంగా రుణమాఫీ కింద ప్రతి రైతులకు రెండు లక్షల చొప్పున మాఫీ చేస్తూ జిల్లాలోనే లక్షా 4వేల మంది రైతులకు రూ.747 కోట్ల 41 లక్షల రుణ మాఫీ చేశామన్నారు. సర్దార్‌నగర్ మార్కెట్ అభివృద్ధికి ప్రభుత్వం రూ.2కోట్ల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ యాస్మిన్‌బాష, జాయింట్ డైరెక్టర్ సంగీతలక్ష్మీ, జిల్లా వ్యవసాయాధికారి ఉషా, డిహెచ్‌ఎస్‌వో సురేష్, ఆర్డీవో చంద్రకళ, వాల్యు ఆయిల్ మేనేజింగ్ డైరెక్టర్ రామకృష్ణ, కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి, చేవెళ్ల, సర్దార్‌నగర్ ఏఎంసీ చైర్మన్లు పెంటయ్యగౌడ్, పీసరి సురేందర్‌రెడ్డి, గుడిమల్కాపూర్ ఏఎంసీ వైస్‌చైర్మన్ కావలి చంద్రశేఖర్, హెచ్‌వో కీర్తికృష్ణ, తహసీల్దార్ అన్వర్, ఎంపిడివో అపర్ణ, వివిధ శాఖల అధికారులు వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


నర్సింహులు(ఫైల్)

చేవెళ్ల, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఇన్నోవా కారు బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల మండల పరిధిలోని చన్వల్లి గ్రామానికి చెందిన తలారి నర్సింహులు(38)కు వ్యవసాయమే జీవనాధారం. రాత్రి ఇంటి నుంచి బైక్‌పై చేవెళ్లకు వస్తుండగా మండల పరిధిలోని పామెన గేట్ సమీపంలో భారత్ పెట్రోల్ బంక్ వద్దకు రాగానే ముందుగా వెళ్తున్న ఇన్నోవా కారు ఎలాంటి ఇండికేటర్స్ లేకుండా సడన్ బ్రేక్ వేయడంతో వెనుక నుంచి వస్తున్న బైక్ కారును ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన నర్సింహులును చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడి వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. అతడికి భార్య, పిల్లలు ఉన్నారు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

షాద్‌నగర్‌లో కారు అద్దాలు ధ్వంసం

షాద్‌నగర్‌రూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణంలోని రైతు కాలనీలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు కారు అద్దాలు ధ్వంసం చేశారు. కాలనీలో నివాసముండే ఖాజా పాషా ఓ దిన పత్రికలో విలేకరిగా పని చేస్తున్నాడు. తన కారును ఇంటి సమీపంలో పార్కు చేసి నిద్రపోయారు. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో గుర్తు తెలియని దుండగులు కారు అద్దాలు ధ్వంసం చేశారు. ఈ విషయమై బాధితుడు సోమవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు.

ఇసుక అక్రమ డంప్‌లు సీజ్

తలకొండపల్లి, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమంగా రవాణా చేసినా, కృత్రిమంగా ఇసుకను తయారు చేసినా కఠిన చర్యలు తప్పవని ఆమనగల్లు సీఐ జానకీరామ్‌రెడ్డి హెచ్చరించారు. తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో అక్రమంగా డంప్ చేసిన ఇసుకను సోమవారం పరిశీలించారు. పడకల్ గ్రామానికి చెందిన జోలం కృష్ణయ్య, చుక్కాపూర్ గ్రామానికి చెందిన మధు గ్రామ శివారులో అనుమతులు లేకుండా ఇసుక డంప్ చేసి ఎక్కువ రేటుకు విక్రయిస్తున్నారని తెలిపారు. ఇసుక డంప్‌లను స్వాధీనం చేసుకొని తహసీల్దార్‌కు అప్పగించినట్లు తెలిపారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ/కొత్తూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం నందిగామ మండల పరిధిలోని తాళ్లగూడలో హెచ్‌ఎమ్‌డీఏ నిధులు రూ.35 లక్షలతో గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను స్థానిక నాయకులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందుకెళ్తున్నారని, ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు శివశంకర్‌గౌడ్, జంగ నర్సింహులు, కొమ్ము కృష్ణ, కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, కావలి కృష్ణ, సత్తయ్య, నర్సింహులు, హరినాథ్ రెడ్డి, కృష్ణారెడ్డి, రవీందర్, శేఖర్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని


నందిగామ: సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం మున్సిపల్ చైర్మన్ బాతుక లావణ్యాదేవేందర్ యాదవ్, స్థానిక నాయకులతో కలసి ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రవీందర్, కౌన్సిలర్లు సోమ్లానాయక్, నాయకులు హరినాథ్‌రెడ్డి, శివశంకర్‌గౌడ్, జనిగె జగన్, సత్తయ్య, కమ్మరి జనార్దన్, రాజశేఖర్‌రెడ్డి, ఎర్రోళ్ల సురేందర్, నర్సింహులు, అంజనేయులు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో బస్సులు నడపాలి


చేవెళ్ల: కమ్మెట చౌరస్తా వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థులు

చేవెళ్ల/ఆదిబట్ల, జూలై 14(ఆంధ్రజ్యోతి): సమయానికి బస్సులు రాక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. సోమవారం ఉదయం చేవెళ్ల మండల పరిధిలోని కమ్మెట చౌరస్తా వద్ద చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులు చేవెళ్ల నుంచి శంకర్‌పల్లి వెళ్లే బస్సులు సమయానుకులంగా రావడం లేదని విద్యార్థులు చేవెళ్ల - శంకర్‌పల్లి వెళ్లే ప్రధాన రోడ్డుపై కొద్దిసేపు రోడ్డుపై అడ్డంగా కూర్చుని ధర్నా చేశారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం సమయానికి బస్సు సౌకర్యం కల్పించాలని ఆదిబట్ల పరిధిలోని కప్పపాహడ్‌లో సీపీఎం గ్రామ కార్యదర్శి ప్రభుదాస్ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు విగ్నేష, దాసు, యాదయ్య, ఆనంద్‌కుమార్, శ్రీనివాస్, భిక్షపతి, వంశీ, వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

కాలనీలో ఆక్రమణలు ఆపండి

యాచారం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గునగల్ గ్రామంలోని శ్రీలక్ష్మీనగర్ కాలనీలోని వెంచర్‌లో 602/ఏ, 602/ఇ సర్వే నంబర్‌లలో ఆక్రమణ జరిగిందని, దీనిపై విచారణ చేయాలని సోమవారం సొసైటీ చైర్మన్ రాజేందర్‌రెడ్డితోపాటు గ్రామస్తులు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, డీపీవో సురేష్‌మోహన్, ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రం అందించారు. వాటిపై ఉన్న రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆంజనేయులు, అచ్చన బాషా, శ్రీనివాస్, నరేష్, రమేష్ ఉన్నారు.

విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలి

కందుకూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ డివిజన్ కన్వీనర్ గుండ్రపల్లి అమరేందర్ కోరారు. సంఘం మండల కన్వీనర్ సీహెచ్ ఆంజనేయులుతో కలిసి సోమవారం తహసీల్దార్ గోపాల్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు హన్మనాయక్, పొడిపాల రమేష్‌నాయిణి, గూడూరు భాస్కర్, జి.కృష్ణ, టి.బాల్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పాఠశాలకు ఫ్యాన్లు వితరణ

షాద్‌నగర్‌రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల ఉన్నత పాఠశాల 2004 - 05 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు వారు చదువుకున్న పాఠశాలకు తమవంతు చేయూతనందించేందుకు ముందుకు వచ్చారు. తరగతి గదుల్లో ఫ్యాన్లు సరిగా లేకపోవడంతో పది ఫ్యాన్లను సోమవారం అందించారు. ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులను అభినందించారు.

కడ్తాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య సేవలు

కడ్తాల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): మైసిగండి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజలకు వైద్య సేవలు ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రి లేక ప్రజలు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. కడ్తాల గ్రామంలో ఆసుపత్రి ఏర్పాటుపై నాయకులు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డికి దృష్టికి తీసుకుపోగా స్పందించిన ఆయన కడ్తాలలో వైద్య సేవలు ప్రారంభించాలని సూచించారు. ఇక నుంచి ప్రతి సోమవారం కడ్తాలలో వైద్యులు అందుబాటులో ఉంటారని వారు పేర్కొన్నారు. డాక్టర్ కిరణ్ ఆధ్వర్యంలో రోగులకు చికిత్స నిర్వహించి మందులు అందజేశారు. ఆసుపత్రిని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి సందర్శించి రోగులకు మెరుగైన సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, నాయకులు లాయక్‌అలీ, జహంగీర్‌అలీ, బోసు రవి, భానుకిరణ్, సత్యం పాల్గొన్నారు.

బీటీ పనులు ప్రారంభం

షాద్‌నగర్ అర్బన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలంలోని మధురాపురం గ్రామ రోడ్డు బీటీ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. కమ్మదనం నుంచి మధురాపురం వరకు ఐదు కిలో మీటర్ల డబల్ రోడ్డు విస్తరణ కోసం ప్రభుత్వం రూ.8 కోట్లు మంజూరు చేసింది. మధురాపురం మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు కొబ్బరికాయలు కొట్టి పనులు ప్రారంభించి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వెంకట్‌రాంరెడ్డి, మాజీ సర్పంచ్ శివశంకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు భార్గవ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు రుణాలు అందించాలి

ఆమనగల్లు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డిని సోమవారం ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీతా నర్సింహా మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. వర్షాకాలం పంటల సాగుకు డీసీసీబీ ద్వారా రైతులకు విరివిగా రుణాలు అందించాలని కోరారు. ధాన్యం నిల్వకు మరిన్ని గోదాముల నిర్మాణానికి కృషి చేయాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు గీతా నర్సింహా తెలిపారు.


బాచుపల్లిలో భూమిపూజ చేస్తున్న పాండురంగారెడ్డి

ప్రజా ప్రభుత్వంలో సొంతింటి కల సాకారం

కందుకూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కల సాకారం కాంగ్రెస్‌తోనే సాధ్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కాప్పాటి పాండురంగారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బాచుపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ బాచుపల్లిలో ఇప్పటివరకు 35 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అందులో 30 మంది నిర్మాణ పనులు ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, రాఘవేందర్, విజయ్, నవీన్‌గౌడ్, సుధాకర్, కత్తుల శ్రీశైలం, జాంగీర్, దేవేందర్‌గౌడ్, బాస్కర్, శ్రీశైలం, కిరణ్‌కుమార్‌చారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మత్తును వీడి మనిషిగా జీవించాలి

కొత్తూరు, జులై 14(ఆంధ్రజ్యోతి): మత్తును వీడి సమాజంలో మంచి మనిషిగా జీవించాలని 16వ అదనపు జిల్లా జడ్జి న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ అంజనేయులు అన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ సూచనల మేరకు సోమవారం కొత్తూరు మండలకేంద్రంలోని సంకల్ప్ వెల్ఫేర్ సొసైటీలో మండల న్యాయ సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. మత్తుకు బానిసైన వారిని ఎందరినో సంకల్ప్ వెల్ఫేర్ సొసైటీ సంస్థ అక్కున చేర్చుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంకల్ప్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు, న్యాయవాదులు నర్వ వేణుగోపాలరావు, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్, పబ్బె శ్రీశైలం పాల్గొన్నారు.

కురుమల అభివృద్ధికి కృషి చేయాలి

శంకర్‌పల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కురుమల అభివృద్ధికి కృషి చేయాలని సంఘం మండల అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటయ్య పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని కొత్తపల్లిలో మండల కురుమ సంఘం అధ్యక్షుడు బండమీది వెంకటయ్య, ఉపాధ్యక్షుడు మోత్కుపల్లి అశోక్ సమక్షంలో కొత్తపల్లి గ్రామ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఒగ్గు విష్ణువర్ధన్, ఉపాధ్యక్షుడిగా ఒగ్గు ప్రశాంత్, సోమని కుమార్, ప్రధాన కార్యదర్శిగా తుత్తురు జంగయ్య, కార్యదర్శులుగా ఒగ్గు ప్రకాశ్, రాజేందర్, కోశాధికారిగా నందకిషోర్ ఎన్నికయ్యారు.

మొక్కలతోనే మానవ మనుగడ

మంచాల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మొక్కలతోనే మానవ మనుగడ ఆధారపడి ఉందని మంచాల ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్య అన్నారు. వన మహోత్సవంలో భాగంగా కళాశాల ఆవరణలో సోమవారం విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. అధ్యాపకులు మాధురి, పూర్ణిమ, గీత, నాగిరెడ్డి, వంశీధర్ పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత

మంచాల, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఇన్సూరెన్సుతో ఖాతాదారు కుటుంబాలకు ఆర్థిక చేయూత లభిస్తుందని తెలంగాణ గ్రామీణ బ్యాంకు జనరల్ మేనేజర్ రామారావు అన్నారు. మంచాలకు చెందిన పులకంటి మణెమ్మ ఆకస్మికంగా మృతి చెందగా ప్రమాద బీమా కింద బాధిత కుటుంబానికి సోమవారం రూ.20 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు మంచాల బ్రాంచి మేనేజర్ సుదాకర్ రావు, ఫీల్డ్ అధికారి అప్పలనాయుడు, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జిగా రవి

చేవెళ్ల, జూలై 14(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ చేవెళ్ల నియోజకవర్గం సోషల్ మీడియా ఇన్‌చార్జిగా చాకలి రవికుమార్ నియమితులయ్యారు. సోమవారం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డి చేతుల మీదుగా రవికుమార్ నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. తనపై ఉన్న నమ్మకంతో నియోజకవర్గం ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. చేవెళ్లలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

ప్రజావాణిలో 152 ఫిర్యాదులు

(ఐదో పేజీ తరువాయి)

చెందిన కిష్టయ్య అడ్డుకుంటున్నాడని ఆరోపించారు. తనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని, పోలీసులు, అధికారులు అతనికే మద్దతు తెలుపుతున్నట్లు ఆరోపించారు. తాను కూల్చివేసిన గుడిసెకు ఏళ్ల తరబడి ఇంటి ట్యాక్స్ కూడా చెల్లించానని, తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం ధర్నా..



ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇప్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ హయత్‌నగర్, ఎల్బీనగర్, సరూర్‌నగర్ సర్కిల్‌లో దిన కూలీలుగా, అసంఘటిత రంగ కార్మికులుగా, ఇతర పనులు చేసుకుంటూ జీవిస్తున్నారని, చాలీచాలని కూలీతో దుర్భర పరిస్థితుల్లో ఉన్నారని తెలిపారు. వీరందరికీ ఇంటి స్థలాలు, ఇళ్లను మంజూరు చేయాలని కోరారు. హయత్‌నగర్, ఆమనగల్లులో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనట్లు ఆయన చెప్పారు. ఈ ధర్నాలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చంద్రమోహన్, కీసర నర్సిరెడ్డి, ఆలేటి ఎల్లయ్య, సీహెచ్ వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల కోసం బారులు

రేషన్ కార్డులు రాని లబ్ధిదారులు జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. సోమవారం పత్రాలు చేతపట్టుకుని క్యూ కట్టారు. రేషన్ కార్డులకు సంబంధించి అధికారులు ఫిర్యాదులు స్వీకరించారు.

ప్రైవేటు దవాఖానాల దోపిడీని అరికట్టాలి

ఆదిభట్ల/తలకొండపల్లి, జూలై 14(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు దవాఖానాల దోపిడీని అరికట్టాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జగన్ కోరారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. నాయకులు శివశంకర్, రాఘవేందర్, మహేష్, వినోద్, శ్యామ్ ఉన్నారు. అలాగే తలకొండపల్లి మండల పరిధిలోని గట్టిప్పలపల్లి పంచాయతీ కార్యదర్శి అనిత సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని గట్టిప్పలపల్లి గ్రామస్తులు, బీఆర్‌ఎస్ నాయకులు కలెక్టర్ నారాయణ రెడ్డిని కోరారు. చెత్త సేకరణ, ట్రాక్టర్ నిర్వహణకే నిధులు సేకరించినట్లు బీఆర్‌ఎస్ నాయకులు తెలిపారు.

బీసీ రిజర్వేషన్ చారిత్రాత్మకం

నందిగామ, జూలై 14(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్‌కు ఆర్డినెన్స్ తీసుకురావడం చారిత్రాత్మకమని మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్ అన్నారు. సోమవారం నందిగామలో బీసీ నాయకులతో కలసి మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేస్తున్నారన్నారు. సమావేశంలో నాయకులు జంగ నర్సింహులు, దేపల్లి కుమార్‌గౌడ్, కావలి కృష్ణ, మంకాల శ్రీశైలం, రవీందర్‌గౌడ్, రవీందర్ ముదిరాజ్, అంజమ్‌గౌడ్, శేఖర్, నర్సింహులు, మల్లేష్, వేణు, చించేటి కృష్ణగౌడ్, రవి పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

తలకొండపల్లి, జూలై 14(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు మధ్యాహ్న భోజన నిర్వాహకులకు రూ.10 వేలు ఇస్తామని ప్రకటించి మాట తప్పిందని సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య ఆరోపించారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులకు నాలుగు నెలలుగా బిల్లులు అందడం లేదని, వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో బిల్లులు చెల్లించాలని కోరుతూ మధ్యాహ్న భోజన నిర్వాహకులు ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం మండల ప్రధాన కార్యదర్శి రమాదేవి, నిర్వాహకులు ప్రేమలత, కమలమ్మ, భాగ్యమ్మ, మంజుల, పద్మ, నాగమణి, మమత, పున్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ఎంపీ మల్లు రవి

జన్మదిన వేడుకలు

ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి, జూలై 14(ఆంధ్రజ్యోతి): టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ రాష్ట్ర ఎంపీల ఫోరం కన్వీనర్, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి జన్మదిన వేడుకలు ఆమనగల్లు పట్టణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లీ రాములు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కడ్తాల్ మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యనాయక్ ఆధ్వర్యంలో ఎంపీ మల్లు రవి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహతో కలిసి కేక్ కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. తలకొండపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీ మల్లు రవి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే ఎంపీ మల్లు రవి హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు సీఎం పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.


ఆమనగల్లులో చీరలు పంపిణీ చేస్తున్న మండ్లీరాములు, కేశవులు, గీతానర్సింహ


శుభాకాంక్షలు తెలుపుతున్న సీఎం రేవంత్ రెడ్డి


శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి


తలకొండపల్లి : మల్లు రవి జన్మదిన వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు


కడ్తాలలో మల్లు రవి జన్మదిన వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు



సందడిగా ఫలహారం బండ్ల ఊరేగింపు

శంషాబాద్, జూలై 14(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని మధురానగర్ పోచమ్మ ఆలయ కమిటీ సభ్యులు బోనాల ఉత్సవంలో భాగంగా సోమవారం ఫలహారం బండ్ల ఊరేగింపు నిర్వహించారు. పొట్టేళ్లను కట్టి ఫలహారం బండ్లను ఊరేగించారు. కార్యక్రమంలో బోనాల కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.